క్లుప్తంగా

ఆరోగ్య క్యాంపును సద్వినియోగించుకోవాలి



మక్తల్: మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు బీపీ,షుగర్, రక్త పరీక్షలు చేశారు. అనంతరం నారాయణపేట జిల్లా డీఎంహెచ్ఓ జయచంద్రమోహన్ క్యాంపును సందర్శించి అక్కడ వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్యాంపును ఏర్పాటు చేసినప్పుడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీదర్, చంద్రకళ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు నూతన హెచ్ఎంలు

ధన్వాడ: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు హెచ్ఎంలను నియమిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ధన్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా ప్రదీప్, గున్ముక్ల ఉన్నత పాఠశాల హెచ్ఎంగా అనిత, కృష్ణాపూర్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా రఘుమోహన్, గోటూర్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా సేల్వాచారిలను నియమించింది. వీరు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

కుంగిన జాతీయ రహదారి



మరికల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో జాతీయ రహదారి స్వల్పంగా కుంగింది. పెద్ద చెరువు అలుగు పారి జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టు కుంగిపోవడంతో రోడ్డుపై గొయ్యి ఏర్పడింది. వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉండడంతో స్థానికులు గొయ్యిపై సూచిక జెండాను పెట్టారు. వర్షాలు కురిసిన ప్రతి సారి రోడ్డు కుంగిపోతున్నా సంబంధింత అధికారులు చూస్తు పోతున్నారే తప్ప స్పందించి మరమ్మతు చేయడం లేదని వాహనచోదకులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారిపై పడిన గొయ్యిని పూడ్చాలని కోరుతున్నారు.

నూతన భవనం నిర్మించాలి



నారాయణపేట: మండలంలోని అభంగాపూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పాత బిల్డింగ్ తొలగించి విద్యార్థుల సంఖ్యకు అనుకూలంగా నూతన బిల్డింగ్ నిర్మించాలని ప్రగతిశీల యువజన సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి రాము మాట్లాడుతూ పాఠశాల పాత భవనం కూలిపోవడంతో భయపడి చాలామంది అక్కడ చదివే విద్యార్థులు టీసీలు తీసుకొని ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నారన్నారు. 120 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో కేవలం ఇద్దరే టీచర్లు ఉన్నారని వెంటనే విద్యార్థులకు అనుకూలంగా ఉపాధ్యాయులను నియమించి నూతన భవనం నిర్మించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ డీఈఓకు పంపిస్తానని హామీ ఇచ్చారు.

పీడీఎస్‌యూ నాయకులతో వాగ్వాదం



మక్తల్: పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులతో మక్తల్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు గొడవకు దిగారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, యూపీలో ఓ ప్రొఫెసర్‌పై హత్యాయత్నం చేసిన ఘటనలో అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదిలా ఉండగా పీడీఎస్‌యూ నాయకులు కళాశాలలో సమస్యల పరిష్కారానికి విద్యార్థులకు మద్దతుగా శుక్రవారం కళాశాలకు రాగా వారిని అడ్డుకున్నారు. డబ్బులకు ఆశపడి యూపీలో ప్రొఫెసర్‌ను హత్య చేయడానికి యత్నించడంపై వారిని నిలదీశారు. చివరికి లెక్చరర్లు కలుగజేసుకొని ఇరువురికి సర్ది చెప్పి పంపించి వేశారు.

‘ఇందిరమ్మ’ వెలుగులు



స్లాబ్ లెవల్ వరకు పూర్తి అయిన ఇల్లు

- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- ముమ్మరంగా ఇళ్ల నిర్మాణాలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

ధన్వాడ: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి అధికారులు మంజూరు పత్రాలను అందజేయడంతో పాటు నిర్మాణం చేపట్టిన వారికి మొదటి విడత రూ.లక్ష వెను వెంటనే ఖాతాల్లో జమ చేస్తుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇసుకను ఉచితంగా అందిస్తామని ప్రభుత్వం చెప్పినా ఆచరణలోకి మాత్రం రాలేదు. దీంతో ఇసుక కొనుగోలుకు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటే ఒక టిప్పర్ ఇసుకకు రూ.25వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు చాలా వరకు ఇసుకకే ఖర్చు చేయాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 500 ఇళ్లు మంజూరు

మండలంలో 20 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 500 మంది లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేసి పత్రాలను అందజేశారు. త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునేలా సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తూ పలు సూచనలు చేస్తున్నారు. ఈ క్రమంలో లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణాలను ప్రారంభించి వేగవంతం చేశారు. మండలం మొత్తంగా ఇప్పటి వరకు 500 ఇళ్లు మంజూరైతే అందులో 316 మంది లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించి మొదటి విడత పూర్తి చేశారు. ఇందులో ఇప్పటి వరకు బేస్‌మెంట్ వరకు పనులు పూర్తి చేసిన 31 మందికి మొదటి విడత కింద రూ.లక్ష బ్యాంకులో జమ అయ్యాయి. ప్రభుత్వం ఎంత త్వరగా పనులు పూర్తి చేస్తే అంత త్వరగా నిధులు మంజూరు చేస్తుందని అధికారులు సైతం అవగాహన కల్పిసుండడంతో లబ్ధిదారులు నిర్మాణాలు ముమ్మరం చేస్తున్నారు.

రూ.5వేలు డిమాండ్ చేస్తున్నారు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచిత ఇసుక అందజేస్తామని ప్రకటించింది. కానీ ధన్వాడ మండలంలో చాలా గ్రామాలకు ఉచిత ఇసుక అందడంలేదు. ఇందుకు కారణం ఇసుక రీచులు లేకపోవడమే. గోటూర్ శివారులో కోయిల్‌సాగర్ వాగులో ఇసుక ఉంది కానీ అక్కడి నుంచి తరలించాలంటే అక్కడి గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. ఒక వేళ తరలించాలంటే ధన్వాడకు ఒక ట్రిప్పుకు రవాణా ఛార్జీల కింద రూ.5వేలు అడుగుతున్నారు. అధికారులు పర్యవేక్షణ చేపట్టి ఇసుకను ఉచితంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి.

> **ఎన్నో ఏళ్ల కల నేరవేరుతుంది**
>
> 
>
> సొంతిల్లు లేకపోవడంతో ఇన్నేళ్లు చాలా ఇబ్బంది పడ్డాం. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో ఇంటి పనులు ప్రారంభించాం. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి కావడంతో ఇటీవల రూ.లక్ష ఖాతాల్లో జమచేసింది. త్వరలోనే తమ సొంతింటి కల నేరవేరనుండడంతో చాలా ఆనందంగా ఉంది.
>
> –అచ్చుగట్ల బీబీ, ధన్వాడ
>
> **చాలా సంతోషంగా ఉంది**
>
> ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో చాలా సంతోషంగా ఉంది. తమకు ఇళ్లు మంజూరు అయిన వెంటనే నిర్మాణం ప్రారంభించాం. ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే రూ.లక్ష రూపాయలు ప్రభుత్వం మా ఖాతాలో జమ చేసింది. మా సొంతింటి కలను నెరవేరుతుండడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి మా కుటుంబమంతా రుణపడి ఉంటాం.
>
> – కుమ్మరి శారదా, ధన్వాడ

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

మక్తల్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీవాసవి మాతకు ముత్యాల హారంతో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో అలంకరణ చేశారు. శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముత్యాలతో అలంకరించి లలిత సహస్రనామాలు చేస్తూ ముత్యాలతో అర్చన చేశారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మీరామాయి , మహిళ సంఘాల మానస సరళ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మహాయజ్ఞం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ్‌లో శుక్రవారం శ్రావణ మహా యజ్ఞం, వేదోపదేశ సమారోహము సంపూర్ణము ఈ నెల 20 నుండి 22వ తేదీ వరకు మూడు రోజులు ఘనంగా నిర్వహించారు. ఈ యజ్ఞం పండిట్ ఆచార్య విష్ణుపద శాస్త్రి మంత్రోచ్చారణాలతో యాగం చేపట్టి అన్న ప్రసాద వితరణ చేశారు.

- నారాయణపేటలోని స్థానిక మహంకాళి దేవాలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు కుంకుమ అర్చన చేసి ఒడి నింపే కార్యక్రమం చేసి మహా అలంకరణ, నైవేద్యం, మహా మంగళహారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు ఆంజనేయస్వామి సప్తాంగం

నర్వ: పెద్దకడ్మూర్ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సప్తాంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్వామి వారికి కృష్ణా నది నుంచి తీసుకొచ్చిన జలాలతో జలాభిషేకం, వేకుజామున పంచామృతాభిషేకం, ఆకులపూజ, అనంతరం మహా మంగహారతి కార్యక్రమాలుంటాయన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలుంటాయన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బందోబస్తు ఏర్పాటు చేయాలి



మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న సీఐ రాంలాల్, అధికారులు

మక్తల్: వినాయక చవితి సందర్భంగా గణేష్ మార్గ్‌ను మక్తల్ సీఐ రాంలాల్ పరిశిలించారు. అనంతరం మక్తల్ మినీ ట్యాంకు బండ్ దగ్గరకు వెళ్లి నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. మక్తల్‌లో గణేష్ మార్గ్‌ను ముందస్తుగా అంబేడ్కర్ చౌరస్తా, ఆజాద్‌నగర్, కర్నిరోడ్, బాసన్‌గేరి, వాకిటిగేరి, నల్లజానమ్మ దేవాలయం, మినీ ట్యాంకు బండ్, రూట్ మార్గాల్లో కరెంటు వైర్లు, చెట్లు రోడ్లకు అడ్డం రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని సూచించారు. ప్రార్థన మందిరాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్లపై గుంతలు వంటి ఉంటే వాటిని మరమ్మతు చేయాలని కోరారు. ట్యాంకు బండ్ దగ్గర పరిశుభ్రంగా ఉంచాలని చెత్త చెదారం లేకుండా ఉంచాలన్నారు. చెరువు కట్ట దగ్గర బారీకేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, ఏఈఈ నాగశివ, మార్కెట్ డైరెక్టర్ రంజిత్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ సైదులు

మద్దూరు: పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ సైదులు అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం గణేష్ మండప నిర్వాహకులు, హిందూ మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలలో డీజేలకు అనుమతి లేదన్నారు. అందరూ శాంతి యుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలన్నారు. అలాగే విగ్రహాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్ పోర్టల్‌లో తప్పకుండా నమోదు చేసుకోవాలని, అలా నమోదు చేసుకోవడం వలన ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్,మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డును వెంటనే పూర్తి చేయాలి

నారాయణపేట టౌన్: బొమ్మన్‌పాడ్ నుంచి బోయిన్‌పల్లి వరకు బీటీ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలియజేశారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు మొత్తం బురదమయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావునా వెంటనే తాత్కాలికంగా మట్టి రోడ్డు వేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్‌అండ్‌బీ అధికారి రాములుకు విన్నవించారు. రోడ్డును వేయకుంటే ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెన్నప్ప యాదవ్, సాక ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధమవుదాం

ఊట్కూరు: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుదామని బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. ఊట్కూరులో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని, గ్రామాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే అన్ని గ్రామాలకు ఇన్‌ఛార్జ్‌లను నియమించామని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీ చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, మాజీ ఎంపీటీసీ హనుమంతు, నాయకులు కృష్ణయ్యగౌడ్, కొండన్‌గోపాల్, లక్ష్మన్, రణవీర్, ఆశప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



మక్తల్: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ట్రయినీ కలెక్టర్ ప్రణీత్‌కుమార్ వైద్యులను ఆదేశించారు. పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓపీ సేవలు, సిజరిన్ కేసులు తదితర వాటిపై ఆరా తీశారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

నానో యూరియాను ఉపయోగించాలి

కృష్ణా: రైతులు తమ పంటలకు నానోయూరియాను ఉపయోగించాలని, నానోయూరియాతో అనేక ఉపయోగాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ సూచించారు. శుక్రవారం మండలంలోని చేగుంట గ్రామ రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నానో యూరియాతో పంటల దిగుబడితో పాటు సమయం,డబ్బులు ఆదా అవుతాయన్నారు.అలాగే ఒక ఎకర పొలానికి కేవలం 500 మిల్లీలీటర్ల నానోయూరియా సరిపోతుందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మరికల్: మండలంలోని అప్పంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం జడ్పీ సీఈఓ శైలేష్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అనే విషయంపై ఆరా తీశారు. అంగన్‌వాడీలకు వచ్చే పిల్లల పట్ల బాధ్యతగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న, విండో అధ్యక్షులు వెంకట్రామారెడ్డి, కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు

కృష్ణా: విద్యార్థులకు గ్రంథలయాలు ఎంతో ఉపయోగకరమని ఎంఈఓ నిజాముద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కున్సీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఫోన్లలో మునిగి తేలకుండా పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అనిత, అశోక్, అమృత పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మక్తల్: పట్టణంలో లయన్స్ క్లబ్ సహకారంతో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజయోగిణి ప్రకాశమణి దాదీ 18 వ పుణ్యతిథి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించి వంద యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలిపారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

నారాయణపేట: జిల్లా కేంద్రమైన నారాయణపేట పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందిదేనని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పారిశుద్ధ్య కార్మికులతో కమిషనర్ మాట్లాడారు. నగరంలో ఏ వార్డు చూసినా గలీజ్ కనపడకుండా డ్రెయినేజీల్లో మురుగు, రోడ్లపై చెత్తచెదారాన్ని తొలగించాలన్నారు. పారిశుద్ధ్య విభాగంలోని జవాన్లు, కార్మికులు ఏఏ వార్డుల్లో ఎంత మంది పని చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు తెల్లారేసరికి తమకు కేటాయించిన వీధుల్లోకి వెళ్లి జవాన్‌ల పర్యవేక్షణలో వీధులు శుభ్రం చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. జవాన్‌లు ప్రతి రోజు పారిశుద్ధ్య కార్మికుల వెంట ఉండి వారు చేస్తున్న పనులను ఫొటోతీసి వాట్సప్ గ్రూప్‌లో వేయాలన్నారు. మేనేజర్ అజీమ్, సిబ్బంది శ్రీధర్, జవాన్‌లు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



మద్దూరులో అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ



నర్వలో భూమిపూజ చేస్తున్న అధికారులు

సాక్షి నెట్‌వర్క్: గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన పనుల జాతరను అధికారులు శుక్రవారం అన్ని గ్రామాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అధికారులు, నాయకులు పూజా కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి పనులను భూమిపూజ చేశారు.

- మద్దూరులో కాడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకంలో భాగంగా అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే గ్రామ పంచాయతిలో పనిచేసే కార్మికులను, ఉపాధిహామీ పథకంలో 100 రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న వారిని సన్మానించారు.
- నర్వలో రూ.12లక్షలతో అంగన్‌వాడీ భనవ నిర్మాణం చేపట్టగా మండల ప్రత్యేక అధికారి, ఈఈ హీర్యానాయక్ భూమిపూజ నిర్వహించారు. అలాగే నాగిరెడ్డిపల్లిలో రూ. 20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవనానికి కాంగ్రెస్ నాయకులు, అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. డీఈ ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ రాఘవేందర్ పాల్గొన్నారు.
- కృష్ణాలో పంచాయతీ కార్యదర్శి గ్రామసభ నిర్వహించి పాఠశాల భవనానికి మరమ్మతు, సీసీ రోడ్డు, డ్రెయినేజీ, తాగునీరు తదితర సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరించనున్నట్లు తెలిపారు.
- మాగనూర్‌లో పనుల జాతర గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీవో పాల్గొన్ని మాట్లాడుతూ ఏఏ అభివృద్ధి పనులు చేపట్టనున్నారో ప్రజలకు వివరించారు.
- కొత్తపల్లిలోని భూనీడులో అంగన్‌వాడీ, సామూహిక మరుగుదొడ్లకు ఎంపీడీఓ, ఇతర అధికారులు భూమి పూజ చేపట్టారు. కార్యక్రమంలో పలు గ్రామాల పంచాయతి కార్యదర్శులు,అధికార పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- దామరగిద్ద మండలంలోని వివిధ గ్రామాల్లో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఎంపీఈఓ సాయిలక్ష్మి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు, పశువుల షెడ్లు వివిధ అభివృద్ధి, మొక్కలు నాటే కార్యక్రమం వంటి అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల, గ్రామ ప్రత్యేక అధికారులు, ఏపీఓ జయమ్మ, పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట టౌన్: మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని డీఎస్పీ లింగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు ప్రతిరోజు క్రీడాలలో పాల్గొనడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని అలాగే ఉద్యోగ అవకాశాల్లో రెండు శాతం రిజర్వేషన్ లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలలో రాణించాలన్నారు. అనంతరం జిల్లా అథ్లెటిక్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ.. ఈ పోటీలలో అండర్–14,16,18, 20 విభాగాలలో దాదాపు జిల్లా నలుమూలాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఇందులో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 30, 31వ తేదీలలో మహబూబ్‌నగర్‌లోని పాలమూర్ యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఏఈ ధర్మరాజు, గ్రౌండ్ కాంట్రాక్టర్ బాలకృష్ణ, అథ్లెటిక్ కోచ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

నర్వ: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేలా కృషి చేయాలని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు శుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. ఆయన వెంట సీఆర్పీ నర్సింములు తదితరులున్నారు.

ఆకట్టుకున్న టీఎల్ఎం మేళా



కొత్తపల్లి: మండల స్థాయి బోధనభ్యాసన సామగ్రి (టీఎల్ఎం)మేళాను శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ మేళాను మండల విద్యాధికారి ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఉపాధ్యాయులందరూ వారు బోధించే బోధనభ్యాస సామగ్రిని మేళాలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో 20 అంశాలను ప్రదర్శనకు తెగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారు జిల్లా స్థాయిలో వచ్చే నెల 10వ తేదీన జరిగే మేళాలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ జయరాములు, ఎంపీడీఓ కృష్ణారావ్, ఎంపీఓ రామన్న విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్పీ కమిటీ ఎన్నిక

ఊట్కూరు: ఊట్కూరులోని శ్రీరామ్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో శుక్రవారం బీఎస్పీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వాకిటి సంజీవ్, ఉపాధ్యక్షుడిగా జి వెంకటేష్, కార్యదర్శిగా బూశప్పలనుఎన్నుకున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలను అందజేశారు.

‘మార్వాడీలకు ఇక్కడ ఉండే అర్హత లేదు’



మరికల్: నాణ్యత లేని వస్తువులను విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న మార్వాడీలకు రాష్ట్రంలో ఉండే అర్హత లేదని హార్డ్‌వేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ముకుందారెడ్డి అన్నారు. మార్వాడీ గో బ్యాక్ ఉద్యమంలో భాగంగా ఓయూ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం మరికల్‌లో హార్డ్‌వేర్ దుకాణాలను బంద్ చేయించి నిరసన చేపట్టారు. మార్వాడీల దుకాణాల్లో నాణ్యత లేని వస్తువులను విక్రయించి ప్రజలను మోసం చేస్తున్న వీరిన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక వ్యాపారులను నష్టపరిచే మార్వాడీ గో బ్యాక్ ఉద్యమాన్ని ఇకపై ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వర్తక వాణిజ్య వ్యాపార సంఘం అధ్యక్షులు ఆనంద్‌కుమార్, రమేష్, అబ్దులా, సత్యం, విజయ్, రాజేశ్వర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, అల్‌రహ్మాన్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజా బహదూర్ జయంతి



నారాయణపేట టౌన్/మక్తల్: బహాదూర్ వెంకట్‌రామరెడ్డి 156 జయంతిని పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కృష్ణ గోకులం పాఠశాలలో రాజా బహదూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి నియోజకవర్గ అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీఆర్.రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.